హాస్టళ్లలోని సమస్యలను సత్వరం పరిష్కరించండి

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలో ఉన్న పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు, కాలేజీ, స్కూళ్ల హాస్టళ్లలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ స్టూడెంట్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, సభ్యులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. హాస్టళ్లలోని సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వ హయాంలో తాము సాధించుకున్న జీఓలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాలలో అవసరమైన చోట ప్రభుత్వ కాలేజీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కుమార్ కోరారు.


చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కుమార్


బాలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు


రహదారిపైనే పార్కు చేసిన వాహనాలు

నిత్యం ట్రాఫిక్ కష్టాలే!

- రద్దీ వేళల్లో కనిపించని ట్రాఫిక్ సిబ్బంది
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారుల అవస్థలు
- కూడలిలో రహదారిపైనే వాహనాల పార్కింగ్

మీర్‌పేట: కార్పొరేషన్‌లో ప్రధాన కూడలి.. అటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి.. ఇటు బడంగ్‌పేట, ఆదిబట్ల మీదుగా ఓఆర్ఆర్‌కు ఈ కూడలి గుండానే వెళ్లాల్సి ఉంటుంది... ఎప్పుడు రద్దీగా ఉండే కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు కష్టాలు పడుతూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. బాలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉంటుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఉదయం వేళల్లో అయితే కూడలికి రెండు వైపులా వాహనాలు నిమిషాల కొద్దీ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఒక్క ట్రాఫిక్ పోలీసు కూడా కనిపించడని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లు వెళ్తుండడంతో ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్యతో అవస్థలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

కనిపించని ట్రాఫిక్ సిబ్బంది..

ఇంత పెద్ద ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్య తరచూ ఉత్పన్నమవుతున్నా రద్దీ సమయంలో ట్రాఫిక్ సిబ్బంది ఒక్కరూ ఉండరని, ఉదయం 10 గంటలు దాటాకా లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తారని, అది కూడా నిబంధనలు పాటించని వాహనాలకు చలాన్లు విధించేందుకు మాత్రమేనని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇక చౌరస్తాకు రెండువైపులా ఆర్టీసీ బస్సులు, లేదా ఇతర భారీ వాహనాలు మలుపు తీసుకునే చోట రహదారి ఇరుకుగా ఉండడంతో ఇతర వాహనాలు కొంతసేపు నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెప్పారు. ఓ వైపు ట్రాఫిక్, మరో వైపు చౌరస్తాలోనే రహదారిపై వాహనాలు అడ్డగోలుగా పార్కు చేయడంతో కూడలి దాటే వరకు చాలా ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ వేళల్లో, ట్రాఫిక్ సమస్య తలెత్తే చోట సిబ్బంది అందుబాటులో ఉంటే వాహనదారుల అవస్థలు తీరుతాయన్నారు. ట్రాఫిక్ అధికారులు స్పందించి కూడలిలో అన్ని వేళల్లో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా


ఎల్‌ఓసీని వెంకటేశ్వర్లుకు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల వైద్యానికి ఎంతో భరోసా ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌కు చెందిన వై.వెంకటేశ్వర్లు గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు తమను ఆర్థికంగా ఆదుకోవాలని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రాజశేఖర్‌రెడ్డికి విన్నవించగా, ఆయన వారితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.5 లక్షలు మంజూరు చేస్తూ ఎల్‌ఓసీ మంజూరైంది. రాజశేఖర్‌రెడ్డి దానిని వెంకటేశ్వర్లుకు శుక్రవారం అందజేశారు.

గడ్డిఅన్నారం డివిజన్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి


డీసీకి మొక్కను బహూకరిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: డివిజన్‌లో ఉన్న రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సరూర్‌నగర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాతకు విజ్ఞప్తి చేశారు. డీసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను శుక్రవారం మర్యాపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని డీసీని కార్పొరేటర్ కోరారు.

ఇష్టంతో చదివితే ఉజ్వల భవిత


విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఆయన హాల్ టికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ, గుండు వెంకటేశ్వర్లు, కన్నయ్య, బాలరాజు, సంగీత, గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు రాయండి

నాగోలు: పదో తరగతి విద్యార్థులు పరీక్షలను ఎలాంటి భయాందోళనలు పెట్టుకోకుండా ప్రశాంతంగా రాయాలని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధాయుడు విజయేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపేట పాఠశాల 10 వ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షల సమయంలో ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను చదవాలని అన్నారు. మనసులో ఎలాంటి భయాందోళనలు పెట్టుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు తమ పిల్లలను సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 10 వ తరగతి విద్యార్థులకు పెన్నులు, స్కేళ్లు పెన్సిల్స్ తదితరాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శశికళా దేవి, కృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఉషారాణి, చంద్రలేఖ, రమేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు: కొప్పుల


లెక్చరర్స్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు చింతల యాదగిరి, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణగుప్తా, రఘునాథ్‌రెడ్డి, కొప్పుల శ్రీనివాస్, భాస్కర్, నాయకులు కడారి యాదగిరియాదవ్, ఎల్లారెడ్డి, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సలీంనగర్, మలక్‌పేట అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్ రావు నేతృత్వంలో ఐదుగురు ఆఫీస్ బేరర్లు శుక్రవారం పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను నగరంలోని ఆయన చాంబర్‌లో కలిశారు. పెన్షనర్ల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో సత్వరం పరిష్కరించేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. తమ వినతికి చైర్మన్ సానుకూలంగా స్పందించారని, ఏప్రిల్ నెలలో ప్రత్యేకంగా పెన్షనర్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ సెక్రటరీ జనరల్ వినయ్‌కుమార్ తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కోశాధికారి జీఎస్ ప్రసాద్ రావు, సభ్యులు దామోదర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.


చైర్మన్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, చేతి వృత్తులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని అన్నారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 35, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 21. దొండ 23, ఆలు 25, ఉల్లి 22, గోకర 40, దోస 18, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 50, మునగ 35, చిలగడదుంప 60, బీట్‌రూట్ 17, కీర 20, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 60. ఈధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

30న సామూహిక ఉపనయనాలు

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్, వనస్థలిపురం ఆధ్వర్యంలో బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయనాలు కార్యక్రమాన్ని ఈ నెల 30న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర రావు, నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలకు ఫోన్ నం.9848224586, 9652236673, 6302454218 లలో సంప్రదించాలని వారు సూచించారు.

కవిత అరెస్టు అప్రజాస్వామికం: మురుకుంట్ల

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. శుక్రవారం ఆయన ఆర్‌కేపురంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కావాలనే కవిత పేరును చేర్చి వేధింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఇంట్లో సోదాలు చేస్తామని చెప్పి వచ్చిన అధికారులు అరెస్టు చేయడం దారుణమని అన్నారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న సమయంలో అరెస్టు చేయకూడదని, అయినా కేంద్రం ఒత్తిడితోనే అరెస్టు చేశారని విమర్శించారు. కవితను వెంటనే విడుదల చేయాలి అరవింద్ శర్మ డిమాండ్ చేశారు.

ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

పంజగుట్ట: తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇవ్వనున్న ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు ఎంపికకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ఆయా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు, అనంచిన్ని వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు పురస్కారాల వివరాలను వెల్లడించారు. తమ అక్షరాలతో సమాజాన్ని చైతన్యపరిచే జర్నలిస్టులను గౌరవించుకునేందుకే ఈ అవార్డులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు మీడియా రంగంలోని వివిధ విభాగాల్లో ఉన్న అర్హతలు పరిశీలించుకుని దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 7 గంటలలోపు ఇతర వివరాలకు www.tjrr.co.in లేదా ఫోన్ నం. 70366 02022లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు గజ్జల శ్రీనివాస్, గాడిపల్లి పరమేశ్వర్, కంచుకట్ల ప్రకాష్, మాలి కరుణాకర్, శ్రీనివాస్ శివకుమార్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ

పంజగుట్ట: జిల్లా సైనిక్ బోర్డ్ సమావేశం శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక్ బోర్డు అధ్యక్షుడు అనుదీప్ దురిశెట్టి అధ్యక్షతన నిర్వహించినట్లు జిల్లా సైనిక్ బోర్డు సెక్రటరీ శ్రీనేష్ కుమార్ నోరి తెలిపారు. సోమాజిగూడలోని సైనిక్ సంక్షేమ బోర్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మండల రెవెన్యూ కార్యాలయాల నుంచి మాజీ సైనికులకు, వితంతువు కుటుంబ ధ్రువపత్రాం, ఆదాయ ధ్రువ పత్రం తీసుకునే సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే జిల్లా రెవెన్యూ అధికారికి ఇప్పటి నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఇంకా ముగ్గురు యుద్ధ వితంతువులకు ఇళ్ల స్థలాలు మంజూరు కావాల్సి ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఒక ప్రపోజల్ పంపితే రెండు నెలల్లో స్థలాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి, వారికి కావాల్సిన వసతుల కల్పనకు కలెక్టర్ స్పష్టమైన హామీ ఇచ్చారిని తెలిపారు. సమావేశానికి జిల్లా సైనిక్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ కల్నల్ వేణుమాధవ్, జిల్లా సైనిక్ బోర్డు నాన్ అఫీషియల్ మెంబర్స్ సురేష్ కుమార్, శిల్ప ప్రతాప్ రెడ్డి, శివారం ప్రసాద్, బ్రహ్మారెడ్డి అబిద్‌అలీ పాల్గొన్నారు.

మళ్లీ మోదీ రాజ్యమే వస్తుంది


మోదీ రోడ్‌షోకు బయలుదేరుతున్న నాయకులు


వనస్థలిపురం నుంచి వెళ్తున్న రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

చంచల్‌గూడ: దేశంలో మళ్లీ మోదీ రాజ్యమే వస్తోందని యాకుత్‌పురా ఎస్సీ మోర్చా కన్వీనర్ మోహన్‌కృష్ణ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్‌షోలో పాల్గొనేందుకు కుర్మగూడ డివిజన్ నుంచి బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు 'అబకీ బార్ 400 పార్' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దర్శనం ప్రదీప్, నాయకులు గౌతమ్, వరుణ్, యోగి తదితరులున్నారు.

వనస్థలిపురం నుంచి...

వనస్థలిపురం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టిన విజయ సంకల్ప రోడ్ షోకు వనస్థలిపురం నుంచి బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడుతి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు మల్కాజిగిరికి తరలివెళ్లారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి


ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తూ..

రామంతాపూర్: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు మైనార్టీ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. రామంతాపూర్‌లోని అంబేద్కర్ సేవా సమితి భవనానికి, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, రజక సంఘం శారదానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.ఒక కోటి 30 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను శుక్రవారం ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు మంజూరు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తోఫిక్, మురళి, రఫీ, గిరిబాబు, సురేష్, జలీల్ పాషా, సందీప్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి


సీసీ రోడ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. రూ.12 లక్షల నిధులతో కృష్ణ తులసీనగర్ ఆరోరా కాలేజీ నుంచి రామాలయం వరకు ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని అంతర్గత రోడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. దీర్ఘ కాలిక సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికా యుతంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి సురేందర్, భాను, హరీష్, సూరి, సాయికిరణ్, భిక్షపతి, వీరేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్లు వేయించిన కాంగ్రెస్ నాయకులు


బోరు వద్ద జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నాగోలు: బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ సీ బ్లాక్ (సహభావన టౌన్ షిప్) వాసులకు తాగు నీటి సరఫరా చేసేందుకు సీ బ్లాక్‌లో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం రెండు బోర్లు వేయించారు. మల్కాజిగిరి మాజీ ఎంపీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపీ నిధులతో ఈ బోర్లు వేయించారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఆయన ఎంపీ నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరు చేయగా, 800 ఫీట్ల లోతులో రెండు బోర్లు వేయించామన్నారు.

కార్యక్రమంలో సీ బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కార్యదర్శి వెంకన్న, మునిందర్, సరోజ్, నాగోలు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకు చిరంజీవి, డీసీసీ కార్యదర్శి జాలే వెంకట్‌రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, రమేష్, గిరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

పంజగుట్ట: డీఎస్సీ 1998 క్వాలిఫై అయ్యి ఇంటర్వ్యూ ఇచ్చి గత చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగాలు రాకుండా పోయిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని డీఎస్‌సీ 1998 క్వాలిఫైడ్స్ యూనియన్ అధ్యక్షుడు బి.నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి పిట్టల సంజీవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ... గత ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు ఉద్యోగాలు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి మాట తప్పారన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే, 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఇటీవల నియామకపత్రాలు ఇచ్చారని తమను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కూడా ఉద్యోగాలివ్వాలని కోరారు.

ఆరోగ్యంపై అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి


పరీక్షలు చేయించుకుంటున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: ఆరోగ్యంపై అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట డివిజన కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్ కాలనీలోని తెలంగాణ పార్క్ ఆధ్వర్యంలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాన్ని కాలనీవాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ కిడ్నీ, గుండె, షుగర్, బీపీ టెస్టులు చేయించుకోవాలన్నారు. ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శివ నేత, శంకర్, నాగేశ్వర్ రావు కాలనీ అధ్యక్షుడు రాంనాథ్ రెడ్డి, ఎస్ఆర్ఎల్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్, విజయ్ భాస్కర్, రాకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్ పనుల పరిశీలన...

కొత్తపేట డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ నుంచి మూసీనది వరకు నూతనంగా నిర్మిస్తున్న బాక్స్ డ్రైనేజీ లైన్ పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాక్స్ డ్రైనేజీ లైన్ తవ్వకాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మురుగు నీరు మూసీ నదిలోకి వెళ్లి కలిసేలా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బృందావన్ కాలనీలో నూతనంగా డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను కోరారు. వెంటనే స్పందించి ఆయన జలమండలి అధికారులతో మాట్లాడి బృందావన్ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కొరవి శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.